క్లుప్తంగా

18, 19 తేదీల్లో ధ్యాన శిక్షణ



ఎంపీడీఓకు ఆహ్వానం అందజేస్తున్న రామచంద్ర మిషన్ ప్రతినిధులు

పెదపూడి: స్థానిక సత్యసాయి సేవాసమితి భవనంలో ఈ నెల 18, 19 తేదీల్లో ధ్యాన శిక్షణ నిర్వహించనున్నామని కాకినాడకు చెందిన రామచంద్ర మిషన్ ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం పెదపూడిలో మాట్లాడుతూ ప్రస్తుతం ఉద్యోగం, వ్యాపారం, కుటుంబాల రీత్యా చాలామంది తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారన్నారు. వారిలో ఒత్తిడిని తగ్గించి, మెరుగైన ఆరోగ్యం పొందడానికి ఈ తరగతులు ఉపయోగపడతాయన్నారు. 15 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ వీటికి హాజరుకావచ్చన్నారు. ఈ మేరకు ఎంపీడీఓ కొవ్వూరి నరేంద్రరెడ్డి, డిప్యూటీ ఎంపీడీఓ ఎం.సత్యనారాయణరెడ్డి, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులకు ఆహ్వానాలు అందించారు.

ఘనంగా ముత్యాలమ్మ తీర్థం



ఈలకొలనులో కొలువైన ముత్యాలమ్మ

రంగంపేట: ఈలకొలనులో కొలువైన ముత్యాలమ్మ వార్షిక తీర్థ మహోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు విశేష ఏర్పాట్లు చేశారు.ఆలయాన్ని విద్యుద్దీపాలతో అందంగా అలంకరించారు. ఉదయం అమ్మవారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి స్వరూపాలైన గరగలను గ్రామంలో ఇంటింటికీ ఊరేగించారు.

ముగిసిన డిజాస్టర్ మేనేజ్‌మెంట్ శిక్షణ

సీతానగరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులకు మూడు రోజుల పాటు జరిగిన డిజాస్టర్ మేనేజ్‌మెంట్ శిక్షణ తరగతులు శుక్రవారంతో ముగిశాయి. తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆఖరు రోజు జరిగిన కార్యక్రమంలో డిజాస్టర్ రిస్క్ రిడెక్షన్ ట్రైనర్ డి.శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రకృతి విపత్తుల సమయంలో అధికారులు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించామన్నారు. తహసీల్దార్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రకృతి విపత్తుల వల్ల కలిగే నష్టాలను సమర్థవంతంగా ఎదుర్కొని, ప్రతి శాఖ తమ పరిధిలో చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీడీవో ఎం.భారతి మాట్లాడుతూ విపత్తు సమయంలో పంచాయతీ కార్యదర్శులు తగిన రీతిలో స్పందించాలన్నారు. ఎస్సై డి.రామ్ కుమార్ మాట్లాడుతూ వరదల సమయంలో గ్రామాల్లోని ఘాట్లు, రేవుల వద్ద ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



సమావేశంలో పాల్గొన్న డాక్టర్లు, అధికారులు

కోరుకొండ: పౌష్టికాహారంతో పిల్లలకు సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని ఐసీడీఎస్ సీడీపీవో జి.ఝాన్సీరాణి అన్నారు. పౌష్టికాహార పకోత్సవంలో భాగంగా శుక్రవారం కోరుకొండ పీహెచ్‌సీలో సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఝాన్సీరాణి మాట్లాడుతూ చిన్నారుల ఆరోగ్యంపై అంగన్‌వాడీలు శ్రద్ధ కనబర్చాలన్నారు. గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. బిడ్డ పుట్టిన గంటలనే తల్లిపాలు పట్టించాలన్నారు. కార్యక్రమంలో కోరుకొండ సర్పంచ్ కర్రి లక్ష్మీసరోజ, పీహెచ్‌సీ డాక్టర్ ఐ.జ్ఞానచంద్ర, కోటికేశవరం పీహెచ్‌సీ డాక్టర్ కె.కృష్ణవేణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు కె.మోహనలక్ష్మి, జి.ఝాన్సీమణి, సీహెచ్ బాపనమ్మ, ఏసీడీపీఓ సి.వరలక్ష్మి పాల్గొన్నారు.

రెచ్చిపోతున్న మట్టిమాఫియా



గుర్రాల బొమ్మ వద్ద లేఅవుట్‌కు మట్టి తీసుకువచ్చిన లారీ

మధురపూడి: కూటమి ప్రభుత్వంలో మట్టి మాఫియా చెలరేగిపోతోంది. ముఖ్యంగా కోరుకొండ మండలంలో మట్టి బకాసురుల రాజ్యం నడుస్తోంది. అక్రమ లేఅవుట్లు విపరీతంగా పెరిగిపోతున్నారు. మైనింగ్ నిబంధనలను మట్టి వ్యాపారులు లెక్కచేయడం లేదు. కూటమి ఎమ్మెల్యేల మధ్య కుదిరిన నియోజకవర్గం పరిధిలో మట్టినే ఉపయోగించాలన్న ఒప్పందాన్ని బేఖాతరు చేస్తున్నారు. రాజమహేంద్రవరం - కోరుకొండ రహదారిలో గుర్రాల బొమ్మల వద్ద ఉన్న 20 ఎకరాల లేఅవుట్‌ను మెరక చేస్తున్నారు. దీని కోసం మట్టిని జగ్గంపేట నియోజకవర్గంలోని గోకవరం మండలం గుమ్మళ్లదొడ్డి, బావాజీపేటల్లోని పుష్కర కాలువ, పోలవరం కాలువగట్లను కొట్టి తరలిస్తున్నారు.

పూలే సేవలు చిరస్మరణీయం

- మాజీ ఎమ్మెల్యేలు జక్కంపూడి రాజా, డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- ఘనంగా జ్యోతిరావు పూలే జయంతి
- వాడవాడలా విగ్రహాలకు నివాళి



కలవచర్లలో కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా



అనపర్తి వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పూలే చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి

రాజానగరం: పేద, బడుగు వర్గాల సంక్షేమానికి మహాత్మా జ్యోతిరావు పూలే చేసిన సేవలు చిరస్మరణీయమని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్రఅధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. మండలంలోని కలవచర్లలో పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు కొండపల్లి దుర్గారావు ఆధ్వర్యంలో శుక్రవారం పూలే జయంతి ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించి, కేక్‌ని కట్ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు వాసంశెట్టి పెద వెంకన్న, మండల కన్వీనర్ దూలం పెద్ద, కో కన్వీనర్ గండి నానిబాబు, నాయకులు గంగిశెట్టి సోమేశ్వరరావు, అడబాల చినబాబు, దాట్ల రఘు, కొండపల్లి దుర్గారావు, కొల్లి వీర్రాజు, మందాల బాబ్జీ, ఎర్ని ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

● అంటరానితనం, కులవ్యవస్థ నిర్మూలనతో పాటు మహిళోద్ధారణకు జ్యోతిరావు పూలే ఎంతో కృషి చేశారని ఆదికవి నన్నయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ అన్నారు. యూనివర్సిటీలో పూలే చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. ప్రిన్సిపాళ్లు ఎస్.ఉదయ్ భాస్కర్, పి.వి జయనిర్మల, పి.వెంకటేశ్వరరావు, కె.సుబ్బారావు పాల్గొన్నారు.

● సూర్యారావుపేటలో దళిత ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే జయంతి నిర్వహించారు. సంఘాల ప్రతినిధులు మేకల లక్ష్మీపతిరావు, ముప్పిడి శ్రీను, జనిపెల్ల సత్తిబాబు పాల్గొన్నారు.

గొప్ప సంఘ సంస్కర్త

పెదపూడి: జ్యోతిరావు పూలే గొప్ప సామాజిక సంఘ సంస్కర్త అని వైఎస్సార్ సీపీ అనపర్తి నియోజకవర్గం కో ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. అనపర్తిలో వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ నియోజకవర్గం బీసీ సెల్ కన్వీనర్ కొండేటి భీమేశ్వరస్వామి ఆధ్వర్యంలో పూలే జయంతి జరిపారు. మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ జ్యోతిరావు పూలే అగ్ర కులాల ఆధిపత్యం లేని కొత్త సమాజాన్ని సృష్టించారని, మహిళల హక్కుల కోసం పోరాటం చేశారన్నారు. కార్యక్రమంలో అనపర్తి ఏఎంసీ మాజీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, అనపర్తి గ్రామ కన్వీనర్ నల్లమిల్లి మురళీ బాలకృష్ణారెడ్డి, సర్పంచ్ వారా కుమారి, ఉప సర్పంచ్ సత్తి సూరారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు తిరగటి శివ, కర్రి దాసు, బండారి శ్రీను, పార్టీ నాయకులు రాము, సుమన్, బుల్లిరెడ్డి, గంగిరెడ్డి, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

కులవ్యవస్థ నిర్మూలనకు కృషి

అంటరానితనం, కులవ్యవస్థ నిర్మూలనకు మహాత్మా జ్యోతిరావు పూలే కృషి చేశారని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. అనపర్తిలోని పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే అనపర్తిలో జెడ్పీ ఉన్నత పాఠశాలలో పీఎం శ్రీ నిధులు రూ.15 లక్షలతో నిర్మించిన కెమిస్ట్రీ ల్యాబ్, రూ.5 లక్షలతో అభివృద్ధి చేసిన లాంగ్‌జంప్ కోర్టును ప్రారంభించారు. లైబ్రరీ, పశువుల తొట్టె నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

ఆదర్శప్రాయుడు

పెదపూడి: జ్యోతిరావు పూలేను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని ఎంపీపీ కేతా తులసి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పూలే విగ్రహానికి ఆమె, ఎంపీడీఓ కొవ్వూరి నరేంద్రరెడ్డి తదితరులు పూలమాలలు వేశారు. డిప్యూటీ ఎంపీడీఓ ఎం.సత్యనారాయణరెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఎం.శ్రీనివాసు, సచివాలయం కార్యదర్శి ఉషా, వైఎస్సార్ సీపీ పార్లమెంటు నియోజకవర్గం బీసీ సెల్ కన్వీనర్ కేతా శ్రీను, పార్టీ మండల కన్వీనర్ గుత్తుల రమణ పాల్గొన్నారు.

● శహపురంలో ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం(ఏపీఆర్‌సీఎస్), అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య, పీడీఎస్‌యూ తదితర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పూలే జయంతి నిర్వహించారు.

స్ఫూర్తి ప్రదాత

బిక్కవోలు: మహాత్మా జ్యోతిరావు పూలే స్ఫూర్తి ప్రదాత అని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతుల ప్రసాద్ రెడ్డి అన్నారు. బిక్కవోలు వంతెన వద్ద పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. మాజీ ఎంపీపీ బుద్దాల కన్నారావు, రంగాపురం సర్పంచి గండికోట వీరభద్రరావు పాల్గొన్నారు.

● కొమరిపాలెంలో పూలే విగ్రహానికి మాజీ జెడ్పీటీసీ పడాల వెంకట రామారెడ్డి (రాము), ఎంపీపీ తేతలి సుమ, బీసీ సంఘ నియోజకవర్గం నాయకులు రెలంగి నాగేశ్వరరావు, కర్రి శ్రీనువాసరావు, డీవీఆర్, గుడిమెట్ల దుర్గారెడ్డి నివాళులర్పించారు.

● మండల పరిషత్ కార్యాలయంలో పూలేకు ఎంపీపీ తేతలి సుమ, ఎంపీడీవో శ్రీనివాస్, సిబ్బంది నివాళులర్పించారు.

విద్యా ప్రదాత పూలే

కోరుకొండ: మహిళలకు, దళితులకు విద్యనందించిన మహనీయుడు పూలే అని వక్తలు కొనియాడారు. గాడాలలో వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కొండపల్లి దుర్గారావు ఆధ్వర్యంలో పూలే జయంతి నిర్వహించారు.

● కోటి కేశవరంలో సర్పంచ్ ముడే సింధూదివ్య ఆధ్వర్యంలో జరిగిన పూలే జయంతి వేడుకల్లో స్థానికులు పాల్గొన్నారు.

సమసమాజ స్థాపన

సీతానగరం: పూలే కలలు గన్న కుల రహిత సమాజ స్థాపనకు అందరూ కృషి చేయాలని సీతానగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కె.హరేరామకృష్ణ అన్నారు. ఆ కళాశాలలో పూలే చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.



కొమరిపాలెంలో పూలే విగ్రహానికి నివాళి



సీతానగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..



పెదపూడి మండల పరిషత్ కార్యాలయంలో..

అంగన్‌వాడీల్లో 'వెయ్యి రోజుల సంరక్షణ'



శహపురం అంగన్‌వాడీ కేంద్రంలో మాట్లాడుతున్న సూపర్ వైజర్ శ్రీపద్మ

పెదపూడి: అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహిస్తున్న వెయ్యి రోజుల సంరక్షణ (ఈనెల 8 నుంచి 22 వరకూ) కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఐసీడీఎస్ కాకినాడ అర్బన్ ప్రాజెక్టు సంపర సెక్టార్ సూపర్ వైజర్ చింతా శ్రీపద్మావతి అన్నారు. శహపురంలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల తల్లిదండ్రులు, గర్భిణులు, బాలింతలకు శుక్రవారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ వెయ్యి రోజుల్లో తల్లి, బిడ్డ సంరక్షణపై అవగాహన కల్పించి, వారికి మెరుగైన ఆరోగ్యం అందేలా అన్ని రకాల చర్యలు చేపడతారన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా చేతులు శుభ్రం చేసుకోవడాన్ని వివరించారు. గర్భిణులు, కిశోర బాలికలు, బాలింతల్లో వచ్చే రక్త హీనత నివారణకు ఏ జాగ్రత్తలు పాటించాలో వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు రమణమేరి, భూదేవి, సూర్యకళ తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష



సీతానగరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బలరామకృష్ణ

సీతానగరం: ప్రజలకు మంచి సేవలు అందించాలంటే మనందరం కలిసి పని చేయాలని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. సీతానగరం, రాజానగరం, కోరుకొండ మండల ప్రజా పరిషత్ కార్యాలయాల్లో అధికారులతో శుక్రవారం సమీక్షించారు. ముందుగా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ సీసీ రోడ్లు, మేజర్ డ్రైనేజీల డీపీఆర్ తయారు చేసి, గ్రామాల వారీగా అందించాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. తహసీల్దార్ ఎ.శ్రీనివాస్, ఎంపీడీవో ఎం.భారతి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రాబోయే కాలం వైఎస్సార్ సీపీదే



నరేంద్రపురంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమైన జక్కంపూడి రాజా

- నియంతల్లా వ్యవహరిస్తున్న పాలకులు
- కూటమి ప్రభుత్వంపై ప్రజావ్యతిరేకత
- మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: ఎన్నికలలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా, రాష్ట్రంలో జరుగుతున్న కూటమి ప్రభుత్వ నియంత పాలనపై ప్రజావ్యతిరేకత పెరుగుతోందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. ×నా కార్యకర్తలు - నా కుటుంబం× కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని నరేంద్రపురం, కలవచర్ల గ్రామాల్లో పార్టీ శ్రేణులతో సమావేశమయ్యారు. రాజా మాట్లాడుతూ సంక్షేమ పథకాలను పట్టించుకోకుండా వివిధ రకాల చార్జీల పేరుతో ప్రజల నడ్డి విరుస్తున్నారని విమర్శించారు. చంద్రబాబు పాలనలో సంపద సృష్టి అంటూ రాష్ట్రాన్ని అప్పులపాలు చేస్తున్నారన్నారు. రెడ్ బుక్ రాజ్యాంగాన్ని నడుపుతూ వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై దాడులకు పాల్పడుతున్నారన్నారు. ఇలాంటి దాడులతో భయపెట్టాలనుకోవడం వారి అవివేకమన్నారు. ఎటువంటి దాడినైనా సమైక్యతతో తిప్పికొట్టాలన్నారు. కూటమి ప్రభుత్వ పది నెలల పాలనకే ప్రజలు విసిగిపోయారని, ఐదేళ్ల నడిచిన జగనన్న పాలనను సువర్ణ యుగంగా చెప్పకుంటున్నారన్నారు. ప్రజలకు ఏ కష్టం వచ్చినా నేనున్నాననే భరోసానందిస్తూ, వారి సంక్షేమం కోసం అహర్నిశలు పాటుపడిన జగనన్న సర్కారు కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారని, రాబోయే కాలమంతా వైఎస్సార్ సీపీదేనన్నారు. ఈ తరుణంలో ప్రజలకు నిరంతరం అండగా నిలుస్తూ, ప్రభుత్వ నియంతృత్వ పోకడలపై పోరాటం సాగించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు వాసంశెట్టి పెద వెంకన్న, మండల కన్వీనర్ దూలం పెద్ద, కో కన్వీనర్ గండి నానిబాబు, నాయకులు గంగిశెట్టి సోమేశ్వరరావు, అడబాల చినబాబు, కోలపాటి వెంకన్న, పంపన నాయుడు, పంపన శ్రీను, దాట్ల. రఘు, కొండపల్లి దుర్గారావు, కొల్లి వీర్రాజు పాల్గొన్నారు.

పూజారికి రూ.పదివేల అందజేత

కోరుకొండ: మధురపూడి వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజారికి నెల జీతంగా రూ.10 వేలను బీజేపీ నాయకుడు, విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు శుక్రవారం అందజేశారు. ఇటీవల జరిగిన ఆలయ, విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన హామీ ఇచ్చారు. ఆ మేరకు శుక్రవారం పూజారికి నగదు అందజేశారు.

శాన్ లేబొరేటరీస్‌తో జీజీయూ ఒప్పందం



ఒప్పందం పత్రాలను అందుకుంటున్న చైతన్యరాజు, తిలక్ తదితరులు

రాజానగరం: హైదరాబాద్‌లోని శాన్ లేబొరేటరీస్‌తో గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయూ) ఒప్పందం కుదుర్చుకుంది. ఇందుకు సంబంధించిన పత్రాలను జీజీయూ చాన్సలర్ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు), శాన్ లేబొరేటరీస్ ఎండీ ఆర్‌వీ తిలక్ శుక్రవారం పరస్పరం అందుకున్నారు. ఈ ఒప్పందం ద్వారా విద్య, పరిశ్రమల రంగాలలో గణనీయమైన సహాయ, సహకారాలను అందుతాయని వీసీ డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. కార్యక్రమంలో ప్రొ చాన్సలర్ కె.శశికిరణ్‌వర్మ, లేబొరేటరీస్ నిర్వహణాధికారి డాక్టర్ శ్రీనివాస్, జీజీయూ డైరెక్టర్ ఆర్‌ఎస్ రాజు, ఫార్మసీ ప్రిన్సిపాల్ ఎండీ ధనరాజ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల పర్యటన

రాజానగరం: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ప్రజలకు అవగాహన కలిగిస్తూ బీజేపీ నిర్వహిస్తున్న పల్లెకు పోదాం కార్యక్రమం పాలచర్లలో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా పార్టీ నాయకులు అక్కడి ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, ఆస్పత్రులను సందర్శించి, కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాల పై అవగాహన కలిగించారు. రైల్వే బోర్డు సలహా కమిటీ సభ్యుడు బొమ్ముల సతీష్, మండల కమిటీ ప్రధాన కార్యదర్శి బిందు శేఖర్, మెండి ప్రసాద్, గణేష్, ఫణి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యరంగంలో పారా మెడికల్‌కు ప్రాధాన్యం



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రముఖులు

రాజానగరం: వైద్య రంగంలో పారా మెడికల్ వృత్తి నిపుణులకు ప్రాధాన్యం పెరుగుతోందని జీఎస్ఎల్ వైద్యకళాశాల ఎండీ డాక్టర్ గన్ని సందీప్ అన్నారు. జీఎస్ఎల్ పారా మెడికల్ కళాశాలలో శుక్రవారం జరిగిన గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమంలో డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులకు ప్రొవిజనల్ సర్టిఫికెట్లను అందజేశారు. వైద్యుల సలహాలు, సూచనలను రోగులకు అర్థమయ్యేరీతిలో వివరించి, త్వరితగతిన కోలుకునేలా చేయడంలో ప్రముఖపాత్ర వహిస్తున్నారన్నారు. ఈ క్రమంలోనే పారామెడికల్ కళాశాలలో మరికొన్ని కొత్త కోర్సులు రాగలవన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ ప్రగతి మాట్లాడుతూ 2003లో ప్రారంభించిన ఈ కళాశాల ద్వారా ఇప్పటి వరకు 21 బ్యాచ్‌ల విద్యార్థులు ఆయా విభాగాలలో నిపుణులుగా బయటకు వెళ్లారన్నారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ సారిక, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.గురునాథ్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.మిశ్రా, సూపరింటెండెంట్ డాక్టర్ టీవీఎస్‌పీ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

కొత్త నాటకానికి తెర లేపిన ఎమ్మెల్యే



మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ విషయంలో కొత్త నాటకానికి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తెరలేపుతున్నారని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి విమర్శించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, కుటుంబానికి తెలిసిన గిమ్మిక్కులు తమకు తెలియవన్నారు. ఆయన స్వార్థ రాజకీయాలకు బలభద్రపురాన్ని బలి చేశారన్నారు. తన కంటే చదువుకున్న స్పెషలిస్టులు బలభద్రపురంలో పర్యటించిన క్యాన్సర్ టీమ్‌లో ఉన్నారన్నారు. బీజేపీ పార్టీకి చెందిన వ్యక్తి ఆరోగ్య శాఖ మంత్రిగా ఉన్నారన్నారు. వీరందరూ కలిసే బలభద్రపురంలో సగటు స్థాయి కంటే తక్కువ క్యాన్సర్ ఉందని ప్రకటించారన్నారు. ఎమ్మెల్యేగా ఆయనకు ఏదైనా అనుమానం ఉంటే మీ మంత్రితో, కలెక్టర్‌తో, ప్రభుత్వం అపాయింట్ చేసిన డాక్టర్ల టీంతో ప్రజల్లో బహిరంగ చర్చ పెట్టాలని డిమాండ్ చేశారు. అంతేకానీ తనతో అవసరం లేదన్నారు. ఒక శాసన సభ్యుడిగా ఆ ప్లాంట్ ఏర్పాటు కాకుండా ఆపాలే తప్ప, ఏర్పాటు కాకుండా చూస్తాననడంతో గూడార్థం దాగి ఉందన్నారు. మీ నాటకాలను ప్రజలందరూ గమనిస్తున్నారని, తగిన బుద్ధి చెబుతారన్నారు.

శ్రీరామనవమి విందుకు ముస్లింలకు ఆహ్వానం

సీటీఆర్ఐ: శ్రీరామనవమి ఉత్సవాలలో భాగంగా నెహ్రూనగర్ సీతారాముల మందిర కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం అన్నసమారాధన నిర్వహించారు. ఈ హిందువులతో పాటు ముస్లింలను కూడా ఆహ్వానించారు. ఈ సందర్భంగా 3, 4 డివిజన్లకు చెందిన ముస్లిం ఈ కార్యక్రమానికి హాజరై అన్నప్రసాదం స్వీకరించారు. హిందూ ముస్లిం సమైక్యతకు ఈ కార్యక్రమం నిదర్శనంగా నిలిచింది. బొంతా శ్రీహరి, నక్కా నగేష్, ఎన్వీ శ్రీనివాస్, బళ్లా శ్రీనివాసరావు, జక్కంపూడి అర్జున్, కాలేపు సాయిరామ్, అమీర్, అల్లాఉద్దీన్, అజీమ్, రబ్బానీ, ముస్తఫా తదితరులు హాజరయ్యారు.

భూమికి సారం.. పంటకు జీవం

- మూడో పంటగా అపరాల సాగు
- పచ్చిరొట్టతోనూ ఎంతో ప్రయోజనం
- రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు



జీలుగ సాగు ప్రయోజనాలను రైతులకు వివరిస్తున్న వ్యవసాయాధికారులు

రాజానగరం: భూమి సారవంతంగా ఉంటేనే సాగు చేసిన పంట మంచి దిగుబడినిస్తుంది. అందుకే ఖరీఫ్, రబీ సీజన్ల అనంతరం వేసవి పంటగా జీలుగ, జనుము, ఉలవ, పిల్లిపెసర వంటి వాటిని రైతులు సాగు చేసి, భూసారాన్ని పెంచేందుకు కృషి చేస్తుంటారు. మెట్ట ప్రాంతంలో రబీ సీజన్‌లో వరి కోతలు జరుగుతున్న ప్రస్తుత సమయంలో ఆయా భూముల్లో కొందరు రైతులు అపరాలను, మరికొందరు పచ్చిరొట్టను సాగు చేస్తున్నారు.

నియోజకవర్గంలో..

నియోజకవర్గంలోని రాజానగరం మండలం నరేంద్రపురం, నందరాడ, కలవచర్ల, సీతారామపురం, తూర్పుగానుగూడెం, రామస్వామిపేట, పల్ల కడియం, గండేపల్లి మండలం మురారి, గండేపల్లి రంగంపేట మండలం ఎస్టీ రాజాపురం, వెంకన్నపేట, వడిశలేరు తదితర గ్రామాల్లో అపరాలను సాగుచేస్తున్నారు. నామవరం, కొండగుంటూరు, సంపత్‌నగరం, జి. యర్రంపాలెం, ముక్కినాడ, పీఆర్సీపురం, అనపర్తి మున్నగు ప్రాంతాలలో వరి పంట కోతలు కాస్త ఆలస్యం కావడం వల్ల ప్రస్తుతం ఇక్కడ అపరాలతో పాటు భూసారానికి పనికి వచ్చే పచ్చిరొట్ట పైర్లను సాగుచేసే పనిలో రైతులు బిజీగా ఉన్నారు.

రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి

భూసారాన్ని పెంపొందించడానికి రైతులు ప్రత్యేక శ్రద్ధ వహించాలి. అధిక దిగుబడులు సాధించడం కోసం రసాయన ఎరువులను అధికంగా వాడితే భూసారం దెబ్బతింటుందనే విషయాన్ని గ్రహించాలి. అటువంటి సమయంలో ఏ పంటలు సాగు చేసినా సరైన ఫలితాలు ఇవ్వలేవు. సాగు భూములు భూసారాన్ని కోల్పోయి, దిగుబడులు కూడా పడిపోతాయని వ్యవసాయాధికారులు హెచ్చరిస్తున్నారు. భూసారాన్ని పట్టించుకోకుండా పంటలను పండించుకుంటూ పోతే అవి చౌడు భూములుగా మారే ప్రమాదం లేకపోలేదంటున్నారు.

మూడో పంటగా..

రబీ సీజన్ తర్వాత మూడో పంటగా భూసారాన్ని పెంచేలా జీలుగ, పిల్లిపెసర, జనుము వంటి వాటితోపాటు పచ్చిరొట్ట పైర్లను సాగు చేయాలి. రసాయన ఎరువుల వినియోగాన్ని క్రమేపీ తగ్గిస్తూ పూర్వకాలం పద్ధతులను అనుసరించేలా పశువుల పెంటను ఎరువుగా పొలాల్లో వేసి, భూసారాన్ని కాపాడుకునే ప్రయత్నం చేయాలి. ఈ పైర్లు పూత దశలో ఉండగా ఆ భూమిని దున్నడం వలన వాటిలోని స్థూలపోషకాలు భూమికి చేరి, భూసారం పెరుగుతుంది. వీటిలో నత్రజని 1.8 శాతం నుంచి 3.5 శాతం, భాస్వరం 0.1 శాతం నుంచి 0.3 శాతం, పొటాషియం 0.5 శాతం నుండి 2 శాతం వరకు ఉంటాయి. స్థూలపోషకాలతో పాటు సూక్ష్మపోషకాలు కూడా భూమికి లభిస్తాయి.

> **భూసారాన్ని పెంచేలా..**
>
> రబీ పంట తర్వాత భూసారాన్ని పెంపొందించేలా అపరాలు, పచ్చిరొట్ట పైరులను వేయడం మంచిది. ఇందుకోసం మినుము, జనుము, జీలుగ విత్తనాలను రైతులు అందించేందుకు ఇండెంట్ పంపించాం. అలాగే సేంద్రియ ఎరువుల వినియోగాన్ని పెంచుకుంటూ రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించుకునే ప్రయత్నం చేయాలి. అప్పుడే భూసారాన్ని కాపాడుకోవడానికి అవకాశం ఉంటుంది.
>
> \- ఎస్‌కే ఇమామి ఖాసిమ్, రాజానగరం మండల వ్యవసాయాధికారి

విపత్తులను ఎదుర్కొనేందుకు సర్వం సిద్ధం

రాజమహేంద్రవరం రూరల్: విపత్తులను ఎదుర్కొనేందుకు సర్వం సిద్ధంగా ఉన్నామని జిల్లా సహాయ అగ్నిమాపక అధికారి పేరూరి శ్రీనివాస్ అన్నారు. హుకుంపేట మండల పరిషత్ కార్యాలయంలో డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌పై రూరల్ తహసీల్దార్ పీవీవీ జయసూర్యకుమార్ అధ్యక్షతన జరిగిన మూడు రోజుల శిక్షణ శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా రాజమండ్రి ఫిషరీస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్, మాస్టర్ ట్రైనర్ ఎం.బ్రహ్మానందం డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌పై అధికారులకు అవగాహన కల్పించారు. అనంతరం రాజమండ్రి అగ్నిమాపక కేంద్రంలో అధికారులకు విపత్తుల సమయంలో ఎలా కాపాడతామన్న విషయాలపై ఏడీఎఫ్‌ఓ శ్రీనివాస్ అవగాహన కల్పించారు. అగ్నిప్రమాదాలు, తుపానులు, వరదలు, భూకంపం తదితర ప్రకృతి విపత్తులు సంభవించే సమయంలో అగ్నిమాపకశాఖ ఏ విధంగా ప్రజలను రక్షిస్తుందన్న విషయాలను వివరించారు. రూరల్ తహసీల్దార్ జయసూర్యకుమార్ మాట్లాడుతూ శిక్షణ పొందిన అధికారులందరూ తమ పరిధిలో అధికారులతో పాటు సిబ్బంది, ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ఇరిగేషన్ ఏఈ సత్యనారాయణ, వ్యవసాయాధికారి ఎ.భీమరాజు, పశుసంవర్ధక శాఖ అధికారి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.